# అనగా అనగా ఒక మహారాజులుంగారు

'వర్ధుల'





**అది తెల్లవారుజామున నాలుగున్నర గంటల సమయం. మహారాజులుంగారు దంతధావనం చేసి సింహాసనంపై ఆసీనులై ఉన్నారు. మంత్రిగారు తదితర సిబ్బంది దర్బారు హాలులో కూర్చుని ఉన్నారు.**

ఇంతలో రాజావారి ప్రాతఃకాల ఫలహారం నిమిత్తం ఒక బతికున్న కోడిపిల్లను తెచ్చారు. రాజావారు దానిని తీసుకుని ఒకసారి గుటుక్కున మింగేశారు. కోడిపిల్ల బతికున్నది కాబట్టి, రాజావారి పొట్టలో గిలగిల తన్నుకుంటోంది. అప్పుడు రాజావారి పొట్టలో భూకంపం మాదిరి కంపనాలు ఉద్భవించి అవి నేరుగా ఆయన మెదడులో ప్రవేశించాయి. అప్పుడు రాజావారి మెదడు చురుగ్గా పనిచెయ్యడం ప్రారంభించి, అక్కడ అనేక విపరీతమైన ఆలోచనలు మొదలయినాయి. అప్పుడు వెంటనే రాజావారు మంత్రిగారిని ఉద్దేశించి -

"మంత్రివర్యా! ప్రస్తుతం మన సమస్యలు ఏమిటి?" అన్నారు.

అప్పుడు మంత్రిగారు వెంటనే, "ప్రభూ! మన ఖజానాలో డబ్బు చాలా తక్కువగా ఉన్నది. మనం ఏమన్నా కొత్తపన్నులు వెయ్యాలి!" అన్నారు.



## డెమి మూర్ (కుక్క)పిల్లలు

మామూలు మనిషికన్నా అమెరికాలో సెలబ్రిటి పెంపుడు జంతువులకి వార్తల్లో విలువ ఎక్కువ. హాలీవుడ్ స్టార్ డెమీమూర్ పెంపుడు కుక్క (డేషండ్ జాతి) క్లారిస్‌కి ఇటీవల ఆరు పిల్లలు పుట్టాయి. అన్ని దినపత్రికల్లో ఆ కుక్కపిల్లల ఫొటోలు ప్రముఖంగా ప్రచురించారు. ఆ ఆరు కుక్కపిల్లలు ఒకే తండ్రికి పుట్టడం విశేషంగా భావించాయి అమెరికా పత్రికలు (తండ్రి మారితే వాటి రూపురేఖలు మారుతుంటాయి)!

**- ఎం.లిపి.**

రాజావారు ఒకసారి కళ్లు మూసుకున్నారు. ఆయన బుర్రలో కంపనాలు తీవ్రతరం అయి, అనేక ఆలోచనలు మొదలయ్యాయి. రాజావారు వెంటనే కళ్లు తెరిచారు. ఆయన కళ్లకు వెంటనే రోడ్డుమీద వేగంగా నడుస్తున్న ఒక ముసలాయన కనిపించాడు.

అప్పుడు చటుక్కున రాజావారు మంత్రిగారితో "మంత్రివర్యా! ఆ రోడ్డుమీద ఇంత చీకట్లో నడిచే ఆ వృద్ధుడు ఎవడై ఉండును?" అన్నారు.

అప్పుడు మంత్రిగారు "అయ్యా! ఆయన ఆరోగ్యం నిమిత్తం నడుస్తున్న ఏ రిటైరైన ఉద్యోగో కావచ్చు!" అన్నారు.

అప్పుడు రాజావారు వెంటనే ఒకసారి కళ్లు మూసుకుని, మళ్లీ తెరిచి, మంత్రిగారితో - "ఇట్లాంటి రిటైరైన ముసలాళ్లు రోడ్డుపై నడుస్తుంటే రోడ్లు త్వరగా పాడవ్వచ్చు. ఇట్లా నడిచే ప్రతివాడూ ప్రభుత్వానికి కొంత పన్ను చెల్లించాలి అని ఒక ఆర్డరు జారీ చెయ్యండి!" అన్నారు.

మంత్రిగారు వెంటనే, "అయ్యా! తమ సలహా అమోఘం! దీనివల్ల మన ఖజానాకు చాలా రాబడి ఉంటుంది. కానీ ఈ పన్నులు వసూలు చేయడానికి కొంత సిబ్బందిని నియమించాలి. వారికి జీతాలు ఇవ్వాలి!" అన్నారు. రాజావారు వెంటనే, "అట్లాగే చేయండి!" అన్నారు.

మంత్రిగారు "చిత్తం! సెలవు!" అన్నారు.

రాజావారు ఒక సంవత్సరం తరువాత ఒక రోజు తెల్లవారుజామున యథాప్రకారం కోడిపిల్లను ఆరగించి మళ్లీ సభలో కూర్చున్నారు. రాజావారి మెదడులో కంపనాలు బయలుదేరి మెదడు చురుకుగా పనిచేయడం ప్రారంభించాక మంత్రిగారితో, "మంత్రివర్యా! ఏమిటి విశేషాలు? ప్రజలు మన గురించి ఏమనుకుంటున్నారు?" అన్నారు.

అప్పుడు మంత్రిగారు, "అయ్యా! మనం క్రితం సంవత్సరం పన్నులు వసూలు చేయడానికి కొంత సిబ్బందిని నియమించాం. వారి జీతాలు, కరవు భత్యాలు వగైరా అన్నీ కలిసి మనం వసూలు చేసిన పన్నుకన్నా పదిరెట్లు ఎక్కువ ఉంది. దీనివల్ల మన ఖజానాలో ఇతర అవసరాలకు కేటాయించిన డబ్బు కూడా చాలా ఖర్చయింది. పైగా, ఈ ఉద్యోగులంతా జీతాలు పెంచమని, కరువు భత్యం పెంచమని తెల్లవారుజామున పనిచేస్తున్నారు కాబట్టి కొంత స్పెషల్ అలవెన్సు ఇమ్మని గొడవ చేస్తున్నారు. ఇవ్వకపోతే సమ్మె చేస్తారట!" అన్నారు.

రాజావారు ఒకసారి కళ్లు మూసుకున్నారు. రాజావారి ఉదరంలో కోడిపిల్ల ఒకసారి కదలి ప్రకంపనాలు అక్కడ నుంచి ఆయన మెదడుకు చేరాయి. రాజావారి మెదడు చురుగ్గా పనిచేసింది. మెదడులో కొన్ని ఆలోచనలు ఉద్భవించాయి. వెంటనే రాజావారు కళ్లు తెరిచి మంత్రిగారితో -

"మంత్రివర్యా! ఈ ముసలివాళ్లు నడిచి వారి ఆరోగ్యాన్ని వృద్ధి చేసుకుంటున్నారు. వీరు ఎక్కువకాలం బతకడంవల్ల ఆహార ధాన్యాలు, ఇతర వస్తువులు ఖర్చయి, ఇతరులకు లేకుండా పోవచ్చు. ఈ కొరత వల్ల ధరలు పెరగవచ్చు. అందువల్ల వీళ్ల ఆయువుకు 60 సంవత్సరాలు సీలింగ్ పెట్టి, అ తరువాత బతికినవారికి కూడా పన్ను విధిద్దాం! ఇవి కాక, పెళ్లి పన్ను, శోభనం పన్ను, గర్భధారణ పన్ను, పుట్టుక పన్ను, మరణం పన్ను మొదలైన ఇతర పన్నులు కూడా విధించండి! అట్లా చెల్లించనివాళ్లని మన రాజ్యం నుంచి తరిమేద్దాం! ఎలా ఉంది ఈ నిర్ణయం?" అన్నారు.

"దివ్యంగా ఉంది, ప్రభూ!" అన్నారు మంత్రి.

"అయితే ఈ ఫర్మానాలాన్నీ జారీ చేయండి!' ' అన్నారు రాజుగారు.

ఒక నెల తర్వాత రాజావారు యథాప్రకారం తెల్లవారుజామున కోడిపిల్లను ఆరగించి ఆసీనులయ్యారు.

మంత్రిగారు - "ప్రభూ! మనం జారీ చేసిన ఫర్మానాలన్నీ ప్రజలు జీవించడానికి అవరోధంగా ఉన్నాయని కోర్టులో అంతా కలిసి దావా వేస్తే కోర్టు మనవన్నీ కొట్టిపారేసి ఖర్చులు కూడా వాళ్లందరికీ ఇమ్మన్నారు ప్రభూ!"

ఈ మాట వినగానే రాజావారు నోరు తెరిచి కుప్పలా కూలిపోయారు. బతికున్న కోడిపిల్ల రాజావారి పొట్టలోంచి 'కొక్కరో కో!' అంటూ బయటకు వచ్చి పరుగెత్తింది. Ⓟ